క్లుప్తంగా

పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో పౌర్ణమి పూజలు



పౌర్ణమి పూజల్లో పాల్గొన్న భక్తులు

నర్సీపట్నం:బలిఘట్టం ఉత్తరవాహిని పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో సోమవారం గురుపౌర్ణమి పూజలు నిర్వహించారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పౌర్ణమి పూజలకు తరలివచ్చారు. ఈ ఆశ్రమ నిర్వాహకులు రమణ మాస్టారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



ఆలయం వద్ద నిర్వహించిన కల్యాణం

మాకవరపాలెం: మండల కేంద్రంలోని కొత్తవీధిలో గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద వార్షిక కల్యాణం వైభవంగా జరిగింది. ఈ ఆలయం నిర్మించి రెండేళ్లు పూర్తి కావడంతో సోమవారం ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కల్యాణోత్సవంలో విశ్వబ్రాహ్మణులు, స్థానికులు, ఇతర గ్రామాలకు చెందిన వారు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీవోను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



ఎంపీడీవోకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ, ఇతర నేతలు

మాకవరపాలెం: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో ఛాయాసుధను మండల వైఎస్సార్‌సీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసారు. ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ రాజారావు, పార్టీ సీనియర్ నేత యర్రాపాత్రుడు, మండల పార్టీ అధ్యక్షుడు చిటికెల రమణ, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు భద్రాచలం, హరిబాబు, బాలకృష్ణ, త్రినాథ్ తదితరులు ఎంపీడీవోను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పది టన్నుల పశుదాణా పంపిణీ

మాకవరపాలెం: పాడిరైతులకు పది టన్నుల సమీకృత పశుదాణా పంపిణీ చేసినట్టు మాకవరపాలెం, రాచపల్లి పశువైద్యాధికారులు మణిదీప్, అనిల్ తెలిపారు. జీ కోడూరు, మాకవరపాలెం, బూరుగుపాలెంలోని పాడిరైతులకు సోమవారం రాయితీపై పశుదాణా అందజేశారు. 50 కేజీల దాణా రూ.555 కు అందజేసినట్టు చెప్పారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల: వచ్చే నెల 3 వ తేదీన మోదకొండమ్మ పండగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి సోమవారం ప్రారంభించారు. అమ్మవారి పండగ రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సర్పంచ్ ఎడ్ల కళావతి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విజయాంజనేయ స్వామి ఆలయానికి విరాళం అందజేస్తున్న అప్పలనాయుడు

మాడుగుల రూరల్: మాడుగుల గాంధీ పార్కు వద్ద గల విజయాంజనేయ స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి దాత విరాళం అందజేశారు. ఎం. కోడూరు గ్రామానికి చెందిన మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, కృష్ణవేణి దంపతులు రూ.15వేలు నగదును ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు రాజీ శ్రీనుకు అందజేశారు.

చోడవరంలో పారిశుధ్యం కంపరం



ఊరికి ఆనుకొని చెత్తడంపింగ్ యార్డులో సంచరిస్తున్న పందులు

- కాలువల్లో సిల్టు, రోడ్లపై చెత్తకుప్పలు
- కానరాని ఫినాయిల్, బ్లీచింగ్ పిచికారీ పనులు
- కేటాయించిన నిధులు పక్కదారి

చోడవరం: నియోజకవర్గ కేంద్రమైన చోడవరం పంచాయతీలో పారిశుధ్య లోపం తాండవిస్తోంది. మరో పక్క ప్రాణాంతక వ్యాధులకు మూల కారణమైన దోమలు, పందులతో జనం రోగాల బారినపడుతున్నారు. వీటిని నివారించాల్సిన పంచాయతీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. పట్టణంలో పేరుకుపోతున్న మురుగు, చెత్తచెదారం వల్ల పందులు ఇష్టారాజ్యంగా కాలువల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకొన్నాయి. మెయిన్‌రోడ్డుపై నిత్యం వేలాది మంది భక్తుల తాకిడితో కిటకిటలాడే షిర్డిసాయి బాబా ఆలయం, చినబజార్, రైతుబజార్ ప్రదేశాల్లో రోడ్లపై ఎక్కడపడితే అక్కడే చెత్తకుప్పలతో నిండిపోయింది. రెల్లివీధి మీదుగా వెళుతున్న ప్రధాన కాల్వతోపాటు పట్టణంలో అన్ని డ్రెయిన్లకు పూడికలు తీయకపోవడంతో మురుగు పెరిగిపోయింది. నౌడువీధి, తామరచెరువు వీధి, బుక్కావారివీధి, బానీకోనేరు, లక్ష్మీదేవిపేట, కోటవీధి ప్రాంతాల్లో కాల్వలన్నీ సిల్టు పేరుకుపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండిపోయి చాలా అధ్వానంగా మారింది. ఈ కాలువల్లో పందులు దొర్లుతున్నాయి. ఇక చెత్తకుప్పలు పట్టణ నడిబొడ్డులోనే అంకుపాలెం, చీడికాడ, పిఎస్‌పేట, అన్నవరం, రోడ్లతోపాటు రెల్లివీధి, బానీకోనేరు, కోటవీధి, తామరచెరువువీధిలో పెద్దపెద్ద చెత్తకుప్పలు ఉన్నాయి. కుళ్లిన పండ్లు, వృథా అయిన ఆహార పదార్థాలను ఈ చెత్తకుప్పలపై వేయడంతో వీటిపై పందులు సంచరిస్తున్నారు. పట్టణానికి ఆనుకొనే చెత్త డంపింగ్ యార్డులు కూడా ఉండడం వల్ల పరిసర ప్రాంతాల్లో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో విచ్చలవిడిగా పందుల సంచారం ఉండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో మలేరియా, టైఫాయిడ్, ఫైలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక రోగులు వ్యాప్తి చెందుతుండడంతో జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమలను నివారించేందుకు పంచాయతీ అధికారులు కనీస చర్యలు చేపట్టలేదు. ఎక్కడా ఫినాయిల్, బ్లీచింగ్ చల్లలేదు. పంచాయతీ జనరల్ ఫండ్ నుంచి ఏటా సుమారు రూ. 10లక్షలు వరకూ ఫినాయిల్, బ్లీచింగ్ నిమిత్తం నిధులు కేటాయిస్తున్నప్పటికీ ఆ నిధులు పక్కదారి పట్టిస్తున్నారు. కనీసం నెలకు ఒక్కసారి కూడా పట్టణంలో ఫినాయిల్, బ్లీచింగ్ చల్లడం లేదు. వీటి నిమిత్తం కేటాయించిన నిధులు ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాలువల్లో సిల్టు, చెత్తకుప్పలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం: ఈఓ నారాయణరావు

పట్టణంలో ప్రధాన డ్రైనేజీల్లో పూడికలు తీసేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణరావు చెప్పారు. ఇప్పటికే ఈ విషయమై ఎమ్మెల్యే కూడా చొరవతీసుకున్నారని, సిల్టు, చెత్త చెదారాలను వెంటనే డంపింగ్ యార్డులకు తరలిస్తామని అన్నారు.



మెయిన్‌రోడ్డు పక్కనే పెద్దకాలువలో పేరుకుపోయిన మురుగు

25లోగా మైనారిటీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి



షేక్ ఉన్నీసా

మాడుగుల : ప్రభుత్వం మైనారిటీలకు అందిస్తున్న 50 శాతం రాయితీపై రుణాలు పొందడానికి ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా మైనారిటీ మహిళా జనరల్ సెక్రటరీ షేక్ ఉన్నీసా తెలిపారు. సోమవారం స్థానిక గాంధీ పార్కువద్ద ఆమె సాక్షితో మాట్లాడారు మైనారిటీ వారు బీసీ ఈ కేటగిరిలోను,ఇతర మైనారిటీవారు సిక్కులు, బౌద్ధులు, జైన్‌లు, పార్శికులు, ఓసీ కేటగిరిలోను దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి స్వయం ఉపాధి పథకం ద్వారా మైనారిటీల వారికి లక్ష నుండి రూ.8 లక్షల వరకు, క్రిస్టియన్ మైనారిటీలకు రూ.లక్ష నుండి రూ.5 లక్షల వరకు 50 శాతం సబ్సిడీపై రుణాలు అందజేస్తారన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రి స్టాఫ్ నర్స్‌ని తక్షణమే సస్పెండ్ చేయాలి



రావికమతం పీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు



రోలుగుంటలో నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు



మాకవరపాలెంలో ఆశ కార్యకర్తల ఆందోళన

రావికమతం : కొంకోట పీహెచ్‌సీ ఆశా వర్కర్ మాధవిని కొట్టిన ఎన్టీఆర్ ఆస్పత్రి స్టాఫ్ నర్స్ సరళని తక్షణమే సస్పెండ్‌చేయాలని రావికమతం మండల ఆశా వర్కర్స్ యూనియన్ రావికమతం పీహెచ్‌సీ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఆశా వర్కర్ మాధవి కొంకోట పీహెచ్‌సీ నుంచి రాత్రి సమయంలో గర్భిణిని కాన్పు కోసం ఎన్టీఆర్ ఆస్పత్రి తీసుకెళ్లగా ఆమె మంచం(బెడ్)పై డెలివరీ జరగడంతో నర్స్ సరళ ఆగ్రహించి ఆశా వర్కర్ మాధవిని చెంపపై కొట్టిందని మండల ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు వజ్రపు సత్యవతి చెప్పారు. ఎన్టీఆర్ ఆసుపత్రి లాగే నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలోనూ కేసులను తీసుకెళ్లేటప్పుడు అక్కడి సిబ్బంది ఆశా వర్కర్స్‌ను చులకనగా చూస్తున్నారని, ఇలాంటి చర్యలు మరలా జరగకుండా ఉండాలంటే నర్స్ సరళపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోలుగుంట: ఆశా వర్కరుపై దౌర్జన్యం చేసిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి నర్సును విధుల నుంచి వెంటనే తొలగించాలని సోమవారం రోలుగుంటలో ఆశా వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు చిరంజీవి మాట్లాడుతూ కొంకోటకు మాధవి అనే ఆశా వర్కరు ఆదివారం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి ఒక మహిళను ఇచ్చిన డేట్‌కు డెలివరీకి తీసుకురాగా నర్స్ సరళ ఆశా వర్కర్‌ని కించపరచి దౌర్జన్యం చేయడం దారుణమన్నారు. వెంటనే ఆమెను విధుల నుంచి తొలగించాలన్నారు.

మాకవరపాలెం: ఆశ కార్యకర్తపై చేయిచేసుకున్న స్టాఫ్ నర్స్‌ను వెంటనే సస్పెండ్ చేయాలంటూ ఆశ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో డెలివరీ కేసు తీసుకువెళ్లిన ఆశ కార్యకర్తపై అక్కడి స్టాఫ్ నర్స్ చేయిచేసుకుందన్నారు. ఈ నేపథ్యంలో మాకవరపాలెం, బూరుగుపాలెం పీహెచ్‌సీల పరిధిలోని ఆశ కార్యకర్తలు సోమవారం స్థానిక పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేశారు. ఆశ కార్యకర్తలపై వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు.


ఉపాధిలో వేతన అవకతవకలపై విచారణ చేయాలి



రావికమతం మండల పరిషత్ కార్యలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

రావికమతం: చీమలపాడు పంచాయితీ చీమలపాడు, కళ్యాణపులోవ గ్రామాలలో ఉపాధి పనుల్లో అవకతవకలపై తక్షణమే విచారణ చేయాలని ఉపాధి కూలీలు స్థానిక మండల పరిషత్ కార్యలయం వద్ద సోమవారం నిరసన తెలియజేశారు. రెండు పంచాయతీలు కలిపి 80 మంది గిరిజనులు నిప్పులు చెరిగే ఎండలో ఉపాధి పనులు చేస్తున్నామని, చేస్తున్న పనికి ప్రభుత్వం 307 రూపాయలు నిర్ణయించిందని, కానీ 150 రూపాయలు మాత్రమే వస్తుందని, దీనికి వీఆర్‌పీ అవకతవకలకు పాల్పడడమే కారణమని అన్నారు. వీఆర్‌పీ బంధువులు ఉపాధి పనులకు రాకపోయినా వారికి మస్తర్లు వేస్తున్నారని ఆరోపించారు. దీనిపై బహిరంగ విచారణ జరపాలన్నారు.

116 మందికి ఉచితంగా వైద్య సేవలు



బోయిలకింతాడ వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది, చిత్రంలో సర్పంచ్ బాబురావు

దేవరాపల్లి:బోయిలకింతాడలో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సంగివలసలోని అనిల్ నీరుకొండ ఆసుపత్రి సౌజన్యంతో మాడుగుల మండలం కేజేపురం భానోదయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక చైర్మన్ రాపేటి రామకొండలరావు, గోవాడ సుగర్స్ సీడీసీ మాజీ డైరక్టర్ అన్నం రామునాయుడు ఆధ్వర్యంలో ఈ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబురావు ప్రారంభించారు. వైద్యశిబిరంలో 116 మందికి వైద్య సేవలందించారు. 26 మందిని వివిధ శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. గైనకాలజిస్టు డా.శ్రావ్య, జనరల్ డాక్టర్ కీర్తి, కంటి వైద్య నిపుణులు డా. అనుషా, చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డా.వర్మ, క్యాంప్ కోఆర్డినేటర్ ఈశ్వరి సేవలందించారు. సీడీసీ డైరక్టర్ అన్నం రాము, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాము, మాజీ ఉప సర్పంచ్ బాబూరావు, మాజీ పాల సొసైటీ అధ్యక్షుడు సాంబమూర్తి పాల్గొన్నారు.

ఆధార్ సేవలు అందరికీ అందాలి

బుచ్చెయ్యపేట : ప్రజలందరికి ఆధార్,రేషన్ కార్డు సేవలు సంక్రమంగా అందేలా సచివాలయ సిబ్బంది పని చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసిన వడ్డాది,బుచ్చెయ్యపేట సచివాలయాలను తనిఖీ చేశారు. ఆధార్ సేవలతో పాటు రేషన్ కార్డుల నమోదు వివరాలు రెండూ సేవలు చేపట్టాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.

హోటల్‌లో తనిఖీలు



హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

నర్సీపట్నం:ప్రచార మాధ్యమాల్లో వచ్చిన ఫిర్యాదు మేరకు నర్సీపట్నంలోని పాలిమర్ హోటల్‌లో తనిఖీలు చేశామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించామన్నారు. హోటల్‌లోని వివిధ రకాల ఆహార పదార్థాల శాంపిల్స్‌ను సేకరించామని తెలిపారు. హోటల్స్ నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు కూడా పదే పదే మరిగించిన ఆయిల్ వినియోగించరాదని అన్నారు. ఫిర్యాదులు వచ్చినట్టయితే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

నవధాన్యాలతో నేలసారం పెంపు

మాడుగుల రూరల్ : ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించడంతో అధిక ఆదాయం సముపార్జించవచ్చునని, ముకుందపురం గ్రామ సర్పంచ్ కర్రి గణేష్ అన్నారు. ముకుందపురం రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక 2025-26 సంవత్సరంలో చేపట్టే సర్వే గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గణేష్ మాట్లాడుతూ నవధాన్యాలు ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ గురించి వివరించారు. 30 రకాల విత్తనాలు పంట భూమిలో వేయడం వల్ల నేలల్లో కర్బన శాతం పెరుగుతుందని, దీంతో నేలల్లో పోషకాలు, జీవవైవిధ్యం, నేల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు.


'అన్నదాత సుఖీభవ'కు దరఖాస్తులు

రోలుగుంట : ప్రభుత్వం రైతుల కోసం చేపట్టిన 'అన్నదాత సుఖీభవ' పథకం వర్తింపు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి తెలిపారు. పథకం పొందడానికి భూమి ఉన్న ప్రతి రైతు ఆధార్ కార్డు, 1,బి తీసుకొచ్చి తమ ఖాతాను మండల కేంద్రం రోలుగుంట వ్యవసాయ కార్యాలయంలో వెరిఫై చేయించుకోవాలని తెలిపారు. ప్రతి రైతు తన రెవిన్యూ పరిధిలో గల రైతుసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలపై ఫిర్యాదు

దేవరాపల్లి : గరిశింగి పంచాయతీలో ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గరిశింగి రెవెన్యూ పరిధిలో ఆక్రమించిన ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

ఘనంగా గౌతమ బుద్ధుని జయంతి



బుద్ధుని చిత్రంపటం వద్ద వందనం సమర్పిస్తున్న అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ సభ్యులు

దేవరాపల్లి: గౌతమ బుద్ధుని బోధనలు ప్రపంచాన్ని మేల్కొల్పాయని అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు అన్నారు. దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహంలో అంబేడ్కర్ మండల ఆశయ సాధన కమిటీ ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుడు జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రజా సంఘాల ప్రతినిధులు, నాయకులు గౌతమ బుద్ధుడు చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి వందనం చేశారు. సమాజం సజావుగా సాగాలంటే పంచశీలాలను పాటించడం అవసరం అన్నారు. కార్యక్రమంలో రైవాడ జలాశయం చైర్మన్ పోతల పాత్రునాయుడు, దీఈఈ సత్యంనాయుడు, మాజీ ఎంపీపీ భాస్కరరావు, సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలి



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం:సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పి.జి.ఆర్.ఎస్)లో భూ సమస్యలు, ఇతర సమస్యలు మొత్తంపై 26 అర్జీలు వచ్చాయని ఆర్డీవో వి.వి.రమణ తెలిపారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆర్డీవో అధికారులను ఆదేశించారు. మాకవరపాలెం మండలం, తామరం గ్రామంలో 142 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువుకు కొండగెడ్డ నుండి నీరు రాక ఆయకట్టు రైతులం ఇబ్బంది పడుతున్నామని ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల పిత్రార్జితమైన ఉమ్మడి భూమిని తమ సోదరుడి పేరున ఆన్‌లైన్ చేసుకున్నాడని, ఆన్‌లైన్ రద్దు చేసి తమకు న్యాయం చేయాలని మాకవరపాలెం మండలం, లచ్చన్నపాలెంకు చెందిన మాసారపు రాముతల్లి, అల్లు వరలక్ష్మి, రుత్తల వరణమ్మ, కేతిరెడ్డి లక్ష్మి ఫిర్యాదు చేశారు. మాకవరపాలెం మండలం, తామరం గ్రామ రెవెన్యూలో సర్వే నెంబరు 87.89లో గెడ్డపోరంబోకు సుమారు 4.61 ఎకరాలను కబ్జా చేసి అనుభవిస్తున్నారని బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఇదేవిధంగా పలు భూ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి.

ఆదివాసీ సాగు భూములకు రక్షణ కల్పించండి



తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మాడుగుల : ఆదివాసీ సాగు భూములకు రక్షణ కల్పించాలని,ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. జనార్ధన్ పాల్గొని మాట్లాడారు.సోమవారం స్థానిక గాంధీ పార్కు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఆదివాసీ గిరిజనులతో ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. మాడుగుల శివార ఆదివాసీ గ్రామం గదబూరులో గ్రామస్తుల భూముల్లో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు చొరబడి కంచె వేయడానికి ప్రయతిస్తున్నారని, కొండగెడ్డలు కప్పి వేసి ఆ భూములను ఆక్రమించుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.గణేష్, గదబూరుకు చెందిన ఆదివాసీ గిరి రైతులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు నిర్వీర్యం చేయొద్దు

నర్సీపట్నం:ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో వి.వి.రమణకు వినతిపత్రాన్ని అందజేసారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను చెల్లించాలన్నారు. డబ్బులు రాకపోవడంతో ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ కూలీలకు జీవించే హక్కును కల్పించేందుకు ఉద్దేశించిన ఉపాధి హామీ చట్టం పారదర్శకంగా అమలు చేయాలన్నారు. చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జున్‌రావు, గొల్లు గురుబాబు, ఎస్.కొండలరావు, శ్రీరామ్మూర్తి, చోడే శ్రీనివాసరావు, రాజుబాబు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో ఆరోగ్యకరమైన పంటలు



విత్తనాల కిట్లను రైతులకు అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

మాకవరపాలెం : రసాయనాలు లేకుండా చేపట్టే ప్రకృతి సాగుతో ఆరోగ్యకరమైన పంటను పొందొచ్చని వ్యవసాయశాఖ పాయకరావుపేట ఏడీ ఉమాప్రసాద్ అన్నారు. మండలంలోని కొండల అగ్రహారం రైతుసేవా కేంద్రం వద్ద ఈ గ్రామంతోపాటు మరికొన్ని గ్రామాల్లోని రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన నవధాన్యాల విత్తన కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సేద్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రాయితీలను అందిస్తున్నాయన్నారు. ఎరువులు, పురుగుమందులు లేని సాగును ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో నవధాన్యాల విత్తనాల కిట్లను పంపిణీ చేసినట్టు చెప్పారు. మండల వ్యాప్తంగా 2700 మంది రైతులకు ఈ నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్నట్టు ప్రకృతి సేద్యం మండల ఇన్‌చార్జ్ కమిత తెలిపారు. ఎంపీపీ సర్వేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పాత్రుడు,ఎంపీడీవో ఛాయాసుధ, ఏవో చిరంజీవి, ఏపీఎం మంగ పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



బుచ్చెయ్యపేటలో ఎంపీడీవోకు వినతి పత్రం అందిస్తున్న కార్మిక సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలని సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సోమవారం బుచ్చెయ్యపేటలో పలు కార్మిక సంఘ నాయకులతో సీఐటీయు నాయకులు సమీక్షించి సమ్మెను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో విజయలక్ష్మికి సమ్మె నోటీసును అందించారు.

కోటమ్మ తల్లి పండగ సందర్భంగా క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వెంకటరమణ

నాతవరం: వచ్చే నెల్ 3వ తేదీన నిర్వహించనున్న కోటమ్మ తల్లి పండగ సందర్భంగా నాతవరంలో అయ్యన్న క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలను సోమవారం నాతవరంలో గల అటవీశాఖకు చెందిన స్థలంలో మండల టీడీపీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ ప్రారంభించారు. ఈ పోటీల్లో 30 జట్లు పాల్గొనడానికి ముందుగా నమోదు చేసుకున్నాయి. విజేతలకు ప్రథమ బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు అందజేస్తామన్నారు. తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ మాజీ ఎంపీపీలు కొండబాబు, విజయకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు



బుద్ధుడు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

రావికమతం: బుద్ధుని శాంతి మార్గంలో అందరూ నడవాలని ఉమ్మడి జిల్లా దళిత సంక్షేమ సమాజం కన్వీనర్ మల్లేటి రాజు తెలిపారు. మండలంలో కొత్తకోట గ్రామంలో డా:అంబేడ్కర్ యువజన సేవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం బుద్ధ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పశు వైద్యశాల సమీపంలో బుద్ధ మందిరం స్థలంలో బుద్ధుడి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దాతలు సహాయంతో బుద్ధుడు మందిర నిర్మాణ పనులు ప్రారంభం చేస్తామని రాజు పేర్కొన్నారు. డా అంబేడ్కర్ సంఘం సభ్యులు గెడ్డం కళ్యాణం, మంజేటి రమణ, ఎద్దు కళ్యాణం, పి.సింహాచలం పాల్గొన్నారు.